నిత్యావసరాల మంట

- కూటమి ప్రభుత్వంలో ధరల బాదుడే బాదుడు
- పెరిగిన కూరగాయలు, వంట నూనె ధరలు
- పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుందంటున్న జనం


చిరు వ్యాపారుల వద్దే కొనుగోళ్లకు మొగ్గు


ధరల పెరుగుదలతో సన్నగిల్లిన వ్యాపారం

పుత్తూరు: కూరగాయలు, వంట నూనెలు, పప్పు దినుసులు తదితర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో సగటు సామాన్యుడు ఏం కొనేటట్టు లేదూ.. ఏం తినేటట్టు లేదూ అంటూ నసుగుతున్నాడు. వచ్చే చాలీచాలని జీతాలతో మధ్య తరగతి వారితోపాటు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కార్మిక, కర్షక ప్రజలు ఈ ధరల బాదుడికి బెంబేలెత్తిపోతున్నారు. సంపాదించే మొత్తం నిత్యావసర వస్తువులకే సరిపోతుంటే కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సి వస్తోందని ప్రజల వాపోతున్నారు. ముఖ్యంగా రోజువారీ సంపాదనపై ఆధారపడి జీవించే వారి పరిస్థితి దుర్భరంగా మారింది. రోజురోజుకు పెరుగుతున్న ధరలను నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

జేబు ఖాళీ చేస్తున్న కూరగాయల ధరలు

మార్కెట్‌లో కూరగాయల ధరలు సామాన్యుడు కొనే పరిస్థితి కనబడడం లేదు. బీన్స్ కేజీ రూ.130, చిక్కుడు రూ.120, క్యారెట్ రూ.100, మునక్కాయలు రూ.100, ఉల్లిపాయలు రూ.80, టమాట రూ.50, అల్లం రూ.90, పచ్చిమిర్చి రూ.80, కాకరకాయ రూ.60, ఉల్లగడ్డ, బీట్‌రూట్ రూ.50, కొత్తిమీర కట్ట రూ.40, ఆకుకూర కట్ట రూ.30 పలుకుతోంది.

చుక్కల్లో వంటనూనె

ప్రస్తుత ప్రభుత్వంలో వంటనూనెల ధరలు అమాంతం పెరిగాయి. గతంతో పోల్చితే లీటరు ఆయిల్‌పై రూ.30 పెరిగింది. దిగుమతి సుంకం పెరగడంతో ఆయిల్ ధరలు పెరిగాయంటూ వ్యాపారులు చెబుతున్నారు. గతంలో 120 ఉన్న ఆయిల్ ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ.150 పలుకుతోంది. పప్పు ధరలకు రెక్కలు వచ్చాయి. ఉద్దిపప్పు కేజీ రూ.170, కందిపప్పు రూ.160 పలుకుతుండడంతో సామాన్యులు కొనే పరిస్థితి కనబడడం లేదు.

బతికేదెలా?



కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రోజువారీ కూలిపని చేసుకొని జీవించే నాలాంటి కుటుంబాల వారు ఎలా బతకాలి. మా కూలి డబ్బు కూరగాయలకే సరిపోతే, కుటుంబ పోషణ ఎలా? ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలి. మద్యం తక్కువ ధరలకే అందిస్తున్నామని ఊదరగొడుతున్న నేటి ప్రభుత్వం, నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు అందించాలి.
– కె.హేమలత, సుందరయ్యనగర్, పుత్తూరు

రైతు బజారు ఏర్పాటు చేయండి



పుత్తూరులో రైతు బజార్ ఏర్పాటు చేయాలి. దీంతో ఈ వ్యాపారుల దోపిడీ నుంచి ఇటు ప్రజలకు, అటు రైతులకు కొంత మేలు జరుగుతుంది. ధరలు పెరిగిపోవడానికి రవాణా చార్జీలు ఒక కారణం. ముందు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించండి. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి. ఇందుకు తగ్గట్టు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.
– ఎం.అంకయ్య, మినీలారీ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్, పుత్తూరు.

రూ.500 పెట్టినా సంచి నిండడం లేదు



మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయమేస్తోంది. రూ.500 జేబులో వేసుకుని వెళ్లినా సంచి నిండా కూరగాయలు రావడం లేదు. ఇంతగా పెరిగిపోతున్న ధరలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అయినా ఆ దిశగా చర్యలు తీసుకుటున్నట్లు కనబడడం లేదు. ధరలు తగ్గించాలంటూ ధర్నాలు చేసే రోజులు దగ్గర పడుతున్నట్లు కనిపిస్తోంది.
– కె.సుభద్రమ్మ, ఎం.బి.నగర్, పుత్తూరు

క్లుప్తంగా

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: గర్భిణులు సకాలంలో నెలవారీ వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాతా శిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, లోకేష్ తెలిపారు. శనివారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. వచ్చిన గర్భిణులకు హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్ తదితర పరీక్షలు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్ల రసాలు, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. అనంతరం 54 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి

శ్రీరంగరాజపురం: మండలంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్లుగా బీఎల్‌ఓ దగ్గర నమోదు చేసుకోవాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఆదివారం కూడా నూతన ఓటరు నమోదు, మార్పు చేర్పులు తదితర వివరాలను బీఎల్‌ఓ దగ్గర నమోదు చేసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా నిర్వహించలన్నారు. ఓటరు నమోదులో నిర్లక్ష్యం వహించే బీఎల్‌ఓలపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బీఎల్‌ఓలు తమకు కేటాయించిన గ్రామాల్లో ఓటరు నమోదు నిర్వహించారు.

ముగిసిన స్కంధ షష్టి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రమణ్యస్వామి

నగరి: కరకంఠేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్కంధషష్టి ఉత్సవాలు శనివారం ముగింపునకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా శనివారం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామివారికి ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఉత్సవాలకు ఉభయదారులుగా వ్యవహరించిన వారికి నిర్వాహకులు ఆలయమర్యాదలు చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును వినియోగించుకోవాలి


ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండల పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ కార్డు క్యాంపుని ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. శనివారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ హేమలత ఆధ్వర్యంలో ఆధార్ కార్డు క్యాంపు నిర్వహించారు. ఆధార్ కార్డు శిబిరాన్ని ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విద్యార్థులు గతంలో ఆధార్ కార్డులో వయస్సు, పేర్లు తప్పులు ఉంటే వాటిని సవరించు కునేందుకు ఆధార్ శిబిరాలు పెట్టామన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, డిజిటల్ అస్టెంట్ శివ, చారుమతి పాల్గొన్నారు.

1,800 లీటర్ల సారా ఊట ధ్వంసం


సారా ఊటను ధ్వంసం చేసిన ఎక్సైజ్ సిబ్బంది

విజయపురం: కేవీపురం దళితవాడలో శనివారం నిర్వహించిన దాడుల్లో 1,800 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కేవీపురం దళితవాడలో పెద్దఎత్తున సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు శనివారం పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో ఎస్‌ఐ వెంకటేశులు తన బలగాలతో కలసి కేవీపురం చేరుకుని దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో డ్రమ్ముల్లో నిల్వవుంచిన 1,800 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... సారా తయారీ, విక్రయాలు నిర్వహించడం నేరమన్నారు. కేసుల్లో పట్టుబడితే జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ దాడుల్లో సిబ్బంది దేశయ్య, ప్రతాప్, సరిత, బాలాజీ, గోవిందస్వామి ఉన్నారు.

కరియమాణిక్య స్వామి సేవలో మాజీ మంత్రి


కరియమాణిక్యస్వామి సేవలో మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: కార్తీకమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆధీనంలోని శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామివారిని మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. ఫల, పుష్పాలు సమర్పించి అర్చనలు చేయించుకున్నారు. స్వామివారి ఊంజల్ సేవలో పాల్గొన్నారు. అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలు చేసి ప్రసాదాలు అందించారు. పురోహితులు వేదమంత్రాలతో ఆమెను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు బాబు, మురుగ, మాజీ కౌన్సిలర్లు పుష్ప, గజేంద్రన్, వైస్ ఎంపీపీ కన్నియప్ప, కోఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బాలకృష్ణ, నాయకులు శశికుమార్, శ్రీహరి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాఘవేంద్ర, సదస్సుకు హాజరైన విద్యార్థులు

- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర సూచించారు. శనివారం న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైతే విలువైన జీవితం నాశనం అవుతుందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యతని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే లైంగిక వేధింపులను నిర్మూలించాలని, పని చేసే చోట స్త్రీలను గౌరవించాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు పడుతాయని స్పష్టం చేశారు. కళాశాల యాజమాన్యాలు ర్యాగింగ్ నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని కళాశాల నుంచి డిస్మిస్ చేయాలని తెలిపారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రజలు తమ వంతు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని అధిరోహించాలని కోరారు. ప్రస్తుత సమాజంలో విద్యకు మించిన సంపద మరొకటి లేదన్నారు. చదువుమీదే దృష్టి సారించాలని, ఈ క్రమంలో ఎలాంటి వ్యామోహాలకు లోనుకాకూడదని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

నారాయణవనం: సైబర్ నేరాలు, నకిలీ లోన్ యాప్‌లపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సైబర్ క్రైమ్ పరిశోధన నిపుణులు నరసింహారావు పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ నివారణ వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి గా పాల్గొన్న డీఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ సైబ ర్ క్రైమ్ రూపంలోనే ఎక్కువ మోసాలు జరుగుతాయన్నారు. ముఖ్యంగా మహిళలను టార్గెట్ చేస్తూ మోసాలు జరుగుతోందన్నారు. మోసపోయిన బాధితులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న తిరుపతి జిల్లా ప్రజలే కాకుండా తిరుపతికి వచ్చే భక్తులు మొబైల్ హంట్ అప్లికేషన్‌ను ఉపయోగించుకొవచ్చునని అన్నారు. 94906 17873 వాట్సాప్ నెంబర్ ద్వారా హాయ్ అని మెసేజ్‌తో వచ్చే గూగుల్ అప్లికేషన్ ఫామ్‌తో ఆన్‌లైన్ ఫిర్యాదులను స్వీకరించి పోయిన మొబైల్‌ను రికవరీ చేసి అందిస్తామని అన్నారు. ఈకేవైసీ, ఆధార్ అప్డేట్, బ్యాంకు పేరుతో కాల్ చేసే అపరిచితులకు ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. బ్యాక్ డోర్ ద్వారా ఉద్యోగం అంటూ నకిలీ ఫోన్ కాల్స్‌కు, ఈమెయిల్స్‌కు రిప్లై ఇవ్వవద్దని అన్నారు. నరసింహారావు మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌పై అవగాహన లేక నేరగాళ్ల చేత మోసపోతున్నారని అన్నారు. ఈజీ మనీకి అలవాటున సైబర్ నిపుణులు అమాయకుల నుండి దోచుకుంటున్నారని అన్నారు. నేరాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు వారోత్సవాలను చేపట్టారని అన్నారు. సదస్సులో సీఐలు, ఎస్‌ఐలు, సైబర్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు సవరణలు చేసుకోండి


సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మంజునాథ్‌గౌడ్

పుత్తూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం పోలింగ్ స్టేషన్లలో ప్రారంభించిన స్పెషల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ, 23, 24 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యాంపుల్లో ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు చేస్తామన్నారు. అనంతరం పోలింగ్ స్టేషన్లను సందర్శించి బూత్ స్థాయి అధికారులకు తగిన సూచనలు, సలహాలిచ్చారు.

ప్రభుత్వంపై ప్రజాపోరు

పుత్తూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం స్థానిక సీపీఎం నాయకులు ప్రజాపోరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తూ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉచిత ఇసుక అంటూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. అన్ని సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న మండల కేంద్రాలలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బస్సు సర్వీస్ పాతదే.. ప్రారంభోత్సవమే కొత్త

పాలసముద్రం: మండలంలోని నంరసింహపురం నుంచి బెంగళూరుకి శనివారం ఎమ్మెల్యే థామస్ బస్సు ప్రారంభోత్సవం చేశారు. గతంలోనే నరసింహపురం, తిరురుమళరాజుపురం గ్రామం మీదుగా ఆర్టీసు బస్సు బెంగళూరుకి వెళ్తోంది. ఆర్టీసీ అధికారులు కలెక్షన్ రాలేదని బస్సు సర్వీస్‌ని ఆపేశారు. వస్తున్న బస్సు సర్వీసుని కొనసాగిస్తున్నారే గానీ, నూత్తన ఆర్టీసీ బస్సు సర్వీసు తీసుకురాలేదని స్థానికులు వాపోతున్నారు. అయితే కూటమి నాయకులు ఆర్భాటంగా ఏదో నూతన బస్సు సర్వీస్ తీసుకొచ్చినట్లు భావించడం విశేషం. టీడీపీ ఎమ్మెల్యే థామస్ జెండా ఊపి బస్సు ప్రారంభించడం ఏం చోద్యమని విస్తుపోతున్నారు. ఈ బస్సు సర్వీసును కలెక్షన్లు రాకపోతే ఆర్టీసీ అధికారులు ఎప్పుడు ఆపేస్తారో తెలియదు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిట్టిబాబు నాయుడు, ఆర్టీసీ డీఎం రూపశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయం మేరకే జలాశయం

కార్వేటినగరం: రైతుల అభిప్రాయం మేరకే మినీ జలాశయం నిర్మాణం చేపడుతామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దాసరినత్తం గంగమాంబాపురం, ముక్కరవానిపల్లి గ్రామాల సరిహద్దుల్లో జలాశయం నిర్మాణానికి కుశస్థలీనదిలో సేకరించిన స్థలాన్ని ఇరిగేషన్ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. కుశస్థలీ నది పరివాహక రైతులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో సాగు నీరు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని, నీటి సౌకర్యాలు పుష్కలంగా ఉందని, జలాశయం నిర్మాణంతో గ్రామాలు నీటమునిగిపోయే అవకాశం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పునరాలోచిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భీమినేని చిట్టిబాబు, నాగేశ్వరరాజు, చెంగల్రాయులు యాదవ్, మాజీ ఎంపీపీ జనార్ధన్‌రాజు, బీగాల రమేష్, మహేష్, రాజేంద్రరెడ్డి, పరంధామ నాయుడు, తిరుమల పాల్గొన్నారు.

108 సిబ్బంది నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న 108 సిబ్బంది

నగరి: సమస్యలు పరిష్కరించాలంటూ 108 కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం 108 వాహనం వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం, అధికారులు తమ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీసులను నేరుగా నిర్వహించాలని కోరారు. అధికారులిచ్చిన హామీ ప్రకారం స్లాబ్ ప్రాతిపదికన అందరికీ వేతనాలు చెల్లించాలన్నారు. సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. వైద్య, ఆరోగ్య శాఖలోని ఈఎంటీ పోస్టుల్లో 108 ఈఎంటీలను నియమించాలన్నారు. పైలెట్లు ఈఎంటీలకు ఇతర ఖాళీల్లో వారి అర్హతలను బట్టి వెయిటేజ్ ఇచ్చి నియామకం చేపట్టాలన్నారు. పైలెట్లను ఆర్టీసీలో డ్రైవర్లుగా వెయిటేజ్ ఇచ్చి నియమించాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. సహజమరణం, ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన జీఓఎంఎస్ నెం.49 ప్రకారం అమలు చేసిన నెలకు రూ.4 వేలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీలు చేయాలని కోరారు. 108 సేవల్లో ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని తెలిపారు. ఈ డిమాండ్లను అధికారులు పరిష్కరించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 25 నుంచి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె నిర్వహిస్తామన్నారు.

దాతల సేవలు మరువలేనివి


రేకుల షెడ్డును పొన్నురంగంతో కలసి పరిశీలిస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: విశ్రాంత ఉపాధ్యాయుడు పొన్నురంగం సేవలు మరువ లేనివని మండల విద్యాశాఖ ఆధికారి ఎం.విజయకుమార్ అన్నారు. ఎమ్మార్సీ భవనం ముందు దాత పొన్నురంగం(విశ్రాంత ఉపాధ్యాయుడు, పద్మావతి, ఉపాధ్యాయిని) దంపతులు నిర్మించి ఇచ్చిన రేకుల షెడ్డును శనివారం ఆయన ప్రారంభించారు. ఎంఈఓ విజయకుమార్ మాట్లాడుతూ పొన్నురంగం కోదండ రామాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు పెద్ద దిక్కుగా నిలిచేవారని గుర్తు చేశారు. ఎమ్మార్సీ భవనానికి గతంలో తన సొంత నిధులు వెచ్చించి గేట్లు ఏర్పాటు చేశారన్నారు. ఉద్యోగ విరమణ చేసినా కూడా విద్యా వ్యవస్థపై తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి దంపతులు విద్యారంగంలో పని చేయడం అభినందనీయమని కొనియాడారు.

దూడలను కాపాడుకోవాలి


పశుపాకలో మేత తింటున్న పాడి పశువులు


జేడీ ప్రభాకర్

నేటి దూడలే రేపటి పశువులు. దూడలకు బలవర్ధక ఆహారం ఇస్తే బలీయమైన పశువులుగా ఎదుగుతాయి. పాలిచ్చే ఆవులు, గేదెల పొదుగులో పాలన్నీ సేకరించడం చాలామందికి అలవాటు. దీనివల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి లోపించి నీరసించిపోతుంటాయి. ఒక్కోసారి మరణాలూ చోటుచేసుకుంటాయి. దూడలు బలంగా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయంలో సహాయ సంచాలకులు ఎం.ప్రభాకర్ వివరించారు.

- జాగ్రత్తలు పాటించాలి

పాలసముద్రం: పుట్టిన దూడలకు కొద్ది రోజుల వరకు తల్లి పశువు నుంచి జున్ను పాలు పట్టించాలి. ఈ జున్ను పాలు తాగించడంతో దూడల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రోగనిరోధక శక్తి పెరిగితే వ్యాధులు అంత త్వరగా ఆశించవు. దూడలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. కొందరు తల్లి పశువు నుంచి పాలు మొత్తం తీయడంతో దూడలకు పాలు చాలక నీరసించిపోతాయి. పశు పెంపకందారులు ఈ విషయాన్ని గుర్తించి దూడలకు కావాల్సినన్ని పాలు వదిలేయాలి. దూడలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఒక్కోసారి అవి మరణించవచ్చు.

దూడలకు సోకే వ్యాధులు

- **అతిసార వ్యాధి:** అపరిశుభ్రమైన పాత్రలు, షెడ్లలో తడి, బురద ఉండడం, ఆహారాన్ని పరిమితికి మించి పెట్టడంతో అతిసార వ్యాధి సోకుతుంది. దుర్వాసనతో కూడిన నీళ్ల విరేచనాలతో దూడలు నీరసిస్తాయి. బరువు కోల్పోతాయి. 1-3 వారాల దూడల ఈ వ్యాధికి లోనవుతాయి.

చికిత్స: బిస్‌మత్ సబ్ నైట్రేట్ ఈ వ్యాధిని అదు పు చేస్తుంది. వైద్యుని సలహాతో సల్ఫా, యాంటిబయాటిక్స్‌ను వాడాలి. దూడ పుట్టిన అరగంటలోపు జున్నుపాలు పట్టించాలి. దూడలకు పరిమితికి మించి పాలను పట్టించకూడదు. షెడ్లను పరిశుభ్రంగా, గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేట్లు ఉంచుకోవాలి.

- **తెల్లపారుడు:** కొన్ని రకాల వైరస్, బ్యాక్టీరియాలతో లేగ దూడలకు ఈ వ్యాధి సోకుతుంది. దూడలు విపరీతంగా పారుతాయి. పారుడుకు ముందు జ్వరం వస్తుంది. కీళ్లు లోపలికి పీక్కుపోతాయి. ఆకలి మందగిస్తుంది. చర్మం పొడిగా, గరుకు ఉంటుంది. కాళ్లలో సత్తువ లేక నీరసించిపోతాయి.

చికిత్స: పశువైద్యుని సలహాతో సల్ఫా యాంటీబయాటిక్స్, డైక్స్‌ట్రోబ్ సెలైన్ వాడాలి.

- **రక్త విరేచనాలు:** ఎక్కువ పాలు తాగించడంతో, సూక్ష్మజీవులు కొక్కిడియా ఆశించి ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడల మలం రక్తంతో కూడి ఉంటుంది. పశుశాలను శుభ్రంగా ఉంచడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి.

చికిత్స: సల్ఫా యాంటిబయాటిక్స్‌ను వాడితే వ్యాధి తగ్గిపోతుంది.

- **నిమోనియా(ఊపిరితిత్తుల వ్యాధి):** బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా ఈ వ్యాధి సోకుతుంది.షెడ్లలో తేమ ఎక్కువగా ఉండడం. చలిగాలుల నుండి సరైన రక్షణ లేకపోవడంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడలకు జ్వరం వస్తుంది. శ్వాస ఇబ్బందికరంగా ఉంటుంది. ఆకలి మందగిస్తుంది. కళ్లు, ముక్కు నుంచి నీరు కఫం వస్తుంది.

చికిత్స: పశుశాలలను శుభ్రంగా ఉంచాలి. చలిగాలుల నుంచి దూడలను రక్షించాలి. సల్ఫాతోపా టు యాంటిబయాటిక్స్‌ను వైద్యుని సలహాతో వాడాలి.


పశుపాకలో మేలిరకమైన పాడిపశువు, దూడ

- **కీళ్ల జబ్బు–బొడ్డు వాపు:** దూడ బొడ్డు సంచికి సూక్ష్మ జీవులు ఆశించడంతో ఈ వ్యాధి సోకుతుంది. బొడ్డునరం సరిగా వేరు చేయనప్పుడు, కత్తిరించడంలో అజాగ్రత్తలతో ఈ వ్యాధి వ్యాపిస్తుం ది. దుర్వాసనతో కూడిన చీము కారుతుంది. సూక్ష్మజీవులు కీళ్లకు కూడా వ్యాపించి కీళ్ల వాతం వస్తుంది.

చికిత్స: దూడ బొడ్డు నరాన్ని టింక్చర్ అయోడిన్ ముంచిన దూదితో అద్దాలి. బొడ్డు ఊడే వరకు పరిశుభ్రమైన స్థలంలో దూడను ఉంచాలి.

- **అంతర పరాన్నజీవులు:** అనేకరకాల పురుగులు జీర్ణాశయాన్ని, ఊపిరితిత్తులను ఆశించడంతో దూడలు నీరసిస్తాయి. అశ్రద్ధ చేస్తే మరణాలు చోటుచేసుకుంటాయి. ఈ పురుగులు పేడ ద్వారా, నేల, నీటి ద్వారా తిరిగి ఆశిస్తాయి.

చికిత్స: ఈ పురుగుల(ఏలికపాములు) నివారణకు పిపర్‌జైన్, పనాకర్, అల్‌బెన్బండజోల్ మందులను వాడాలి.

వ్యాధి నిరోధక టీకాలు

దూడ పుట్టిన 1వ రోజు ధనుర్వాతం ఇంజక్షన్ ఇప్పించాలి. 1-3 రోజుల్లో హస్టానైసిన్, ఆరో వేయించాలి. 4వ రోజు ట్రిపలిన్ ఇంజక్షన్, విటమిన్ -ఏ ఇప్పించాలి. 7-10 రోజుల్లో డీవార్మింగ్, ఆపైన ప్రతి 21 రోజులకు ఆరు సార్లు ఇవ్వాలి. 4వ మాసంలో సంకర జాతి దూడలకు థైలేరియా వ్యాధి నిరోధక టీకా ఇప్పించాలి. 6వ మాసంలో గొంతు వాపు, జబ్బ వాపు టీకాలు వేయాలి.